
ఇంటర్ బలోపేతానికి అడుగులు..




2



2

ఆర్మూర్‌లో లారీ బీభత్సం



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

24-5-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## నందిపేట్‌లో దారుణం.. పసికందును వదిలేసి వెళ్లిన వ్యక్తులు..

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్‌లో అమానుష ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రంలో అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు నిర్మానుష్య ప్రదేశంలో వదిలేసి వెళ్లారు. నందిపేట మండల కేంద్రంలోని రాజ్‌నగర్ దుబ్బ ప్రాంతంలో అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. అక్కడే క్రికెట్ ఆడుతున్న పిల్లలు శిశువు ఏడుపు శబ్దం విని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. వారు స్పందించి పసిబిడ్డను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా బిడ్డ మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**కామారెడ్డి మున్సిపాలిటీలో మరోసారి ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి శనివారం మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో నేరుగా సమీక్షా సమావేశం నిర్వహించడం వివాదానికి దారితీసింది. పట్టణంలో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే కేవీఆర్ అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే సమావేశం రాజ్యాంగ విరుద్ధమని, క్యాంప్ కార్యాలయానికి వెళ్లే అధికారుల నుంచి వివరణ కోరతామని చైర్‌పర్సన్ స్పష్టంగా చెప్పినా అధికారులు వెళ్లడం తీవ్ర చర్చకు తెరలేపింది. ఈ పరిణామం ఎటువైపు దారి తీస్తుందోనన్న చర్చ సాగుతోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



# బల్దియాలో ఆధిపత్య పోరు



- మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం
- తప్పుపట్టిన చైర్‌పర్సన్..
- ఎమ్మెల్యేకు అధికారం లేదని వ్యాఖ్య
- రాజకీయ దుమారం రేపుతున్న వ్యాఖ్యలు



మున్సిపల్ అధికారులతో శనివారం నిర్వహించే సమావేశానికి రావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మున్సిపల్ అధికారులకు లేఖ వచ్చింది. అయితే ఈ పరిణామాన్ని కాంగ్రెస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి తీవ్రంగా తప్పుబట్టారు. మున్సిపల్ పాలకవర్గానికి సమాచారం లేకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే అధికారులతో సమావేశం కావడం రాజ్యాంగ విరుద్ధమని, మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం ఎమ్మెల్యేకు లేదని, కౌన్సిల్ తీర్మానాలకు అనుగుణంగానే అధికారులు నడుచుకోవాలని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. మున్సిపాలిటీపై ఎమ్మెల్యే ఆదేశాలు చెల్లవని వ్యాఖ్యలు చేశారు.

### తీవ్ర దుమారం

కామారెడ్డి ఎమ్మెల్యేగా కాటిపల్లి వెంకట రమణారెడ్డి గెలిచినప్పటి నుంచి అనేక మార్లు మున్సిపల్ అధికారులతో సమీక్ష చేపట్టారు. మున్సిపల్ పాలకవర్గం నూతనంగా ఎన్నికైన తర్వాత కూడా సమీక్ష నిర్వహించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎమ్మెల్యే సమావేశం రాజ్యాంగ విరుద్ధం అంటూ చేసిన చైర్‌పర్సన్ వ్యాఖ్యలు కామారెడ్డి రాజకీయాల్లో దుమారం రేపాయి. ఈ అంశంపై మున్సిపల్ శాఖ జోక్యం చేసుకోవాలని కోరడం, ప్రోటోకాల్ ఉల్లంఘనపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరడం కలకలం రేపుతోంది.

### కొనసాగుతున్న ప్రోటోకాల్ రగడ

అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినప్పటి నుంచి కామారెడ్డి నియోజకవర్గంలో ప్రోటోకాల్ రగడ కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అధికారిక కార్యక్రమా ల్లో పాల్గొనడంపై ప్రోటోకాల్ వివాదం రాజుకుంటూనే ఉంది. ఇప్పుడు ఏకంగా ము న్సిపల్ చైర్‌పర్సన్ ప్రోటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యే తీరును తప్పుబట్టడం, ఎమ్మెల్యే ఆదేశాలు చెల్లవు అంటూ బహిరంగ వ్యాఖ్యలు చేయడంతో రాజకీయ దుమా రం రేగుతోంది. బీజేపీ ఎమ్మెల్యే వర్సెస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ అన్నట్లుగా పరిస్థితి మార డంతో జిల్లా రాజకీయాలు వేడె క్కాయి. చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో మాత్రమే ము న్సిపాలిటీలో రాజకీయ అనిశ్చితి నెలకొనగా పాలకవర్గం కొలు వైన తర్వాత అంతా సాఫీగా సాగుతోంది. తాజాగా ఆమె వ్యాఖ్యలతో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి.

### స్పందించని ఎమ్మెల్యే

మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రకటన అనంతరం సాయంత్రం మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. సమావేశానికి అధికారులు వెళ్తే వారి నుంచి వివరణ కొరతానని చైర్‌పర్సన్ చెప్పినా అధికారులు సమావేశానికి వెళ్లారు. అయితే సమావేశంలో కానీ, సమావేశం అనంతరం కానీ చైర్‌పర్సన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కేవీఆర్ స్పందించలేదు. ఆమె వ్యాఖ్యలను ఖండించలేదు. దాంతో ఎమ్మెల్యే మౌనం వెనక ఆంతర్యం ఏమిటన్న చర్చ సాగుతోంది. మొత్తంగా మున్సిపల్ ప్రోటోకాల్ అంశం ఇప్పుడు కామారెడ్డి రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసి అమ్మవార్లకు సమర్పించారు. బోనాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తూ డీజే పాటలు, డప్పు చప్పుళ్లతో అమ్మవార్ల ఆలయం వరకు తీసుకెళ్లారు. అమ్మవారి ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేసి పెద్ద పోచమ్మ, గజ్జెలమ్మ, నల్ల పోచమ్మ, నాయికమ్మ, లస్మమ్మలకు బోనాలు సమర్పించి ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో గ్రామదేవతలకు బోనాల పండుగ సందర్భంగా ప్రజలు తమ బంధువులను ఇంటికి పిలిచి కుటుంబ సమేతంగా బంధుమిత్రుల సమక్షంలో పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు.




## 15 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిశారు..

**అక్షరటుడే, ఆర్మూర్ :** నందిపేట మండలం బాద్గుణ ఉన్నత పాఠశాల 2010-11 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బాద్గుణలో నిర్వహించిన కార్యక్రమంలో 15 ఏళ్ల తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో వారి జ్ఞాపకాలు అనుభవాలను నెమరు వేసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న పాత మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పిలుచుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి పాఠశాల అనుభవాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ఆయా రంగాలకు సంబంధించిన విషయాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా రోజంతా ఆనందంగా గడిపారు. మరోసారి అందరూ తప్పకుండా కలుసుకోవాలని తీర్మానించుకుని వీడ్కోలు పలికారు. నాడు విద్యార్థులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై తాత్సారం చేస్తున్న ప్రభుత్వాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ప్రాంతానికి సాగునీరు తెచ్చే కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని జలసాధన సమితి జిల్లా కన్వీనర్ వెంకట్రాంరెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకురావాలనే ఉద్దేశంతో గత 20 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల కార్యక్రమంలో భాగంగా సెవెంత్ లింకు కెనాల్ అని ప్రకటించి ఆ తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరును 21, 22 ప్యాకేజీల ద్వారా గోదావరి జలాలను కామారెడ్డి ప్రాంతానికి తరలిస్తామని ప్రకటించారన్నారు. పదేళ్లుగా ప్రజలను ఆశల పల్లకీలో ఉంచారని పేర్కొన్నారు. ఈ మధ్యలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి నిధులు మంజూరు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. కామారెడ్డి జలసాధన సమితి తరపున రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటన జరిపి అధికారులకు వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా సమితి జల



సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న కామారెడ్డి పట్టణంలోని కర్షక్ బీఎడ్ కాలేజీ ఆవరణలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి స్థానిక ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు ప్రతి ఒక్కరు హాజరై విజయంతం చేయాలని కోరారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు టి హన్మాండ్లు, వేణుగోపాల్, శ్రీనివాస్, అంజయ్య, ఫిరంగి రాజేశ్వర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లయ్య చెరువు మట్టి తరలింపుపై అఖిలపక్ష సమావేశం

**అక్షరటుడే, బాన్సువాడ:** ఎల్లయ్య చెరువు మట్టి తరలింపు అంశంపై ఆదివారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి మున్సిపాలిటీలోని ప్రతిపక్ష కౌన్సిలర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ పేరుతో ఎల్లయ్య చెరువులోని మట్టిని నిజమైన రైతులకు అందించకుండా ఇటుక బట్టీలు, వెంచర్ నిర్వాహకులు, చెరువు పరిసర ప్రాంతాల్లోని ప్లాట్ల యజమానులకు వందలాది టిప్పర్ల ద్వారా విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులే మట్టి అమ్మకాలలో పాల్గొంటున్నారని, ఇదేనా అభివృద్ధి అని ప్రశ్నించారు. బాన్సువాడ మున్సిపాలిటీలోని ఏడుగురు ప్రతిపక్ష కౌన్సిలర్లు ఈ విషయంపై ఆర్డీవో, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదని తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల అభ్యర్థనలను అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే మట్టి అక్రమ తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్య



క్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిజమైన అభివృద్ధి అంటే రైతుల అవసరాలకు అనుగుణంగా మట్టిని వారి పొలాలకు తరలించడమేనని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, నార్ల రత్నకుమార్, మామిళ్ల రాజు, బీజేపీ నాయకులు శంకర్ గౌడ్, ప్రసాద్, టీడీపీ నాయకుడు షంషుద్దీన్‌తో పాటు మున్సిపాలిటీకి చెందిన ఏడుగురు ప్రతిపక్ష కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో గత విద్యా సంవత్సరం ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించింది. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలోని కొందరు ప్రొఫెసర్స్‌తో పాఠాలు బోధిస్తున్నారు. మరిన్ని రెగ్యులర్ పోస్టులు మంజూరు చేస్తామని ప్రభుత్వం గతంలోనే హామీ ఇచ్చింది. అయితే శనివారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో తెలంగాణ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలకు 87 పోస్టులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో 54 టీచింగ్, 33 నాన్-టీచింగ్ పోస్టులు ఉండడం గమనార్హం.**

**– అక్షరటుడే, డిచ్‌పల్లి**



# తెయూ ఇంజినీరింగ్ కళాశాలకు మంచి రోజులు

- 87 పోస్టులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇంజినీరింగ్ విద్య బలోపేతానికి ఆస్కారం

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలనేది జిల్లా వాసుల చిరకాల కల. ఇందుకోసం విద్యార్థులు అనేక పోరాటాలు చేస్తున్నారు. సీఎం, మంత్రులను కలిసి వినతులు ఇచ్చారు. నిజామాబాద్, ఆదిలాబాద్ మిగహా, మిగతా ఉమ్మడి జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయనే విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. సుదీర్ఘ కాలం తర్వాత ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల నెలకొలుపుతున్నట్లు జీవో జారీ చేసింది. దీంతో గత విద్యా సంవత్సరం జిల్లా విద్యార్థులకు ప్రభుత్వ ఇంజినీరింగ్ విద్య చేరువైంది.

### ఇంజినీరింగ్‌కు మంచిరోజులు..

తెలంగాణ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలకు మంచి రోజులు రానున్నాయి. యూనివర్సిటీలో వసతుల కొరత కారణంగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించలేదు. తద్వారా ఇంజినీరింగ్‌లో అడ్మిషన్స్ సంఖ్య తగ్గింది. అయితే ప్రస్తుతం యూనివర్సిటీలో కొత్తగా రెండు మహిళా హాస్టల్స్, ఒక బాయ్స్ హాస్టల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పిస్తే అడ్మిషన్స్ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే ప్రభుత్వం 87 పోస్టులు మంజూరు చేయడం మరో విశేషంగా చెప్పొచ్చు. దీంతో తెలంగాణ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలకు మంచి రోజులు రానున్నాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

### ఆనందంగా ఉంది..

యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలకు 87 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయడం ఆనందంగా ఉంది. ఈ పోస్టులకు సంబంధించిన జీవో మూడు నెలల కిందటే జారీ అయింది. మంజూరైన పోస్టులను భర్తీ చేసే అంశం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

– ప్రొఫెసర్ యాదగిరిరావు, వీసీ, తెయూ



## నాళేశ్వర్‌లో ఘనంగా ఊర పండుగ

**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో ఊర పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలను కడలతో ఊరేగింపుగా, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించి గంగాజలంతో అభిషేకం చేశారు. అనంతరం గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఊరేగింపులో పోత రాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామదేవతలకు బలిహరణం నిర్వహించారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్మూర్ లావణ్య మట్లాడుతూ నాళేశ్వర్ గ్రామంలో ఊరపండుగలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ, ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఊర పండుగలో భాగంగా గ్రామంలో పాడి పశువులు, పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని శాస్త్రి నగర్ కాలనీలో ప్రభుత్వ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం ఆవరణలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫీస్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. అనంతరం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో ఈ స్వచ్ఛ కార్యక్రమాన్ని 55 వారాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ కార్యాలయంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. రైతన్నకు అండగా నిలిచే కార్యాలయంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈడీఏ విజయలక్ష్మి, ఆఫీస్ అటెండర్ సాయిలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కృషివర్ధన్, జహీర్, గణేష్, రాజన్న, శ్యాంసుదర్, రాహుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధితుడి చికిత్సకు ప్రభుత్వ భరోసా

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** కల్తీ కల్లు అలవాటుతో దుబాయ్‌లో మానసిక ఇబ్బందులకు గురైన డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లికి చెందిన మొద్దు గంగాధర్‌కు ప్రభుత్వం ఉచిత వైద్యం అందించనుంది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి చొరవతో చికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు. గంగాధర్‌ను స్వదేశానికి రప్పించి, డీఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందించాలని అతని భార్య సుప్రియ ఈనెల 12న ప్రజాభవన్‌లోని 'ప్రవాసీ ప్రజావాణి'లో విన్నవించారు. దీంతో బాధితుడి పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి జీఏడీ ఎన్నారై సెల్ అధికారులకు తగిన చర్యల కోసం లేఖ రాశారు. దీంతో స్పందించిన సెంటర్ వైద్యులు కుటుంబ సభ్యులు తోడుగా ఉంటే చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణ యం తీసుకుంది. ఈ నిర్ణయంతో నిజామాబాద్ జిల్లాలోని 16, కామా రెడ్డి జిల్లా పరిధిలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 18,500 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. – అక్షరటుడే, ఆర్మూర్




# ఇంటర్ బలోపేతానికి అడుగులు..

- విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం
- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 18,500 మందికి లబ్ధి

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు మధ్యాహ్న భోజనం అందిస్తుండగా, ఇంటర్ విద్యార్థులకు మాత్రం ఎలాంటి సదుపాయం లేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలల్లో ఉండే విద్యార్థులు, ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజా నిర్ణయంతో ఉదయం 8:30 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం అందించనున్నారు. మెనూలో రాగిజావ, ఉప్మా, పులిహోర, కిచిడీతో పాటు కోడిగుడ్డు, అరటిపండు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

### హాజరు శాతం పెరిగే అవకాశం...

ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోని కళాశాలల్లో గ్రామీణ విద్యార్థుల సంఖ్య ఎక్కువ. మరోవైపు పట్టణ కేంద్రాల్లోని కళాశాలలు పట్టణ శివారులో ఉండడంతో ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకోలేని పరిస్థితి. దీంతో చాలామంది మధ్యాహ్నం ఇంటికి వెళ్లి తిరిగి రావడం లేదు. కొత్త పథకం అమలైతే హాజరు శాతం 1520శాతం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### అమలుపై స్పష్టత కోసం ఎదురుచూపులు

పథకం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పటికే నిర్వహిస్తున్న ఏజెన్సీలకే అదనపు బాధ్యత అప్పగిస్తారా, లేక కొత్త టెండర్లు పిలుస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. మరో వైపు పేద విద్యార్థులకు ఇది గొప్ప వరం. 'కడుపు నిండితే చదువుపై దృష్టి పెడతారు' అని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పేద విద్యార్థులకు ఎంతో మేలు..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర కేబినెట్ నిర్ణయం పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. తూతూ మంత్రంగా కాకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. – దుర్గాప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

### విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు..



ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా జూనియర్ కళాశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడం విద్యార్థుల ఉన్నతికి ఎంతగానో తోడ్పడుతుంది. చాలామంది పేద విద్యార్థులకు మేలు కలుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల ఉన్నతికి ఎంతగానో దోహదపడుతుంది. –సిద్ధార్థ, సీఈసీ సెకండ్ ఇయర్ విద్యార్థి

## వ్యభిచార గృహంపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో వ్యభిచార గృహంపై చీతా ఫోర్స్ సిబ్బంది మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సీసీఎస్ ఇన్‌ఛార్జి ఏసీపీ మస్తాన్‌అలీ ఆదివారం వివరాలు వెల్లడించారు. సీసీఎస్ ఇన్‌ఛార్జి ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నాల్గో టౌన్ పరిధిలో వ్యభిచారం జరుగుతోందనే పక్కా సమాచారం మేరకు వినాయక్‌నగర్‌లోని ఓ ఇంటిపై చీతాఫోర్స్ సిబ్బంది దాడులు చేశారు. దాడిలో మొత్తం ఏడు ఫోన్లు, ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే రూ.4,870 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం వారిని నాల్గో టౌన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు సీసీఎస్ ఇన్‌ఛార్జి ఏసీపీ మస్తాన్ అలీ పేర్కొన్నారు.

## కామారెడ్డిలో దొంగల సంచారం.. సీసీ కెమెరాల్లో రికార్డు..




**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో దొంగల సంచారం కలకలం రేపుతోంది. శివారు కాలనీల్లో అపరిచిత వ్యక్తులు అర్ధరాత్రి తర్వాత చేతిలో ఆయుధాలతో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇటీవల పట్టణంలో దొంగతనాల సంఖ్య పెరుగుతోంది. లిక్కర్ మార్ట్, షాపులు, ఇళ్లలో భారీ చోరీలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలు, సాంకేతికత ఆధారంగా చోరీలకు పాల్పడుతున్న దొంగలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. అయినా దొంగల సంచారం పెరుగుతూనే ఉంది. తాజాగా జయశంకర్ కాలనీలో దొంగలు కలకలం సృష్టిస్తున్నారు. దొంగలు సంచరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డయ్యాయి. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ అర్ధరాత్రి వేళలో దొంగతనానికి పాల్పడేందుకు రెక్కీ నిర్వహిస్తున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో కూడా ఇదే కాలనీలో భారీ దొంగతనాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. వేసవికాలం దృష్ట్యా సెలవులు ఉండడంతో పలువురు ఇళ్లకు తాళాలు వేసి టూర్లు, సొంత గ్రామాలకు వెళ్తున్నారు. ఇదే అదునుగా దొంగతనాలకు పాల్పడేందుకు రెక్కీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు. రాత్రి వేళలో శివారు కాలనీల్లో పోలీస్ గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆర్మూర్‌లో లారీ బీభత్సం..



**అక్షరటుడే,ఆర్మూర్ :** పట్టణంలో లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా కారును ఢీకొట్టగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అంకాపూర్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ కథనం ప్రకారం.. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారును.. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వస్తున్న లారీ అతివేగంగా ఢీకొంది. దీంతో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



## కారు బైక్ ఢీ.. పలువురికి తీవ్ర గాయాలు..

**అక్షరటుడే, గాంధారి:** కారు, బైక్ ఢీకొని పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గాంధారి మండలంలోని బుగ్గ గండి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని బుగ్గ గండి వద్ద ఆదివారం కామారెడ్డి నుంచి బాన్సువాడ వెళ్తున్న కారు.. మేడిపల్లి గ్రామం నుంచి వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న గాంధారి మండలం మేడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హనుమాన్ నాయక్ తండాకు చెందిన గంగా సింగ్ ఆయన తల్లి యమునకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. స్పందించిన పైలట్ గోవర్ధన్, ఈఎంటీ కమలాకర్ క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

నిజామాబాద్ నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో..




కామారెడ్డి పట్టణంలో..



నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి)లో..



ఓబీసీ నగర అధ్యక్షుడు బాసోల్ల నాగరాజు ఆధ్వర్యంలో..



# ఘనంగా పీసీసీ చీఫ్ జన్మదిన వేడుకలు..

పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



నందిపేట కేదారీశ్వర ఆలయంలో ..



మెండోరా మండలంలో ..



తెలంగాణ యూనివర్సిటీలో..



నంది పేట్‌లో రక్తదాన శిబిరం..